www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

## సామాజిక మాధ్యమాలు, ప్రసార మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం: మైదుకూరు డిఎస్పి జి.రాజేంద్ర ప్రసాద్



**బద్వేల్,జూలై20.అక్షర టైమ్స్:-** వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు పట్టణంలోని మార్తోమా నగర్‌లో ఉన్న 3 సెంట్ల ఇంటి స్థలానికి సంబంధించి బద్వేలుకు చెందిన పిన్నం వెంకటయ్య మరియు ప్రొద్దుటూరుకు చెందిన అయ్యవారమ్మ తదితరుల మధ్య కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో, జూలై 18వ తేదీ సాయంత్రం పిన్నం వెంకటయ్యకు మరియు సదరు స్థలాన్ని అయ్యవారమ్మ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పబడుతున్న కడపకు చెందిన బొజ్జా తిరుమలేష్ తదితరుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని సంఘటన సమాచారం అందుకున్న వెంటనే బద్వేలు టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, ఇరు వర్గాలను అక్కడి నుండి పంపించి శాంతిభద్రతలను పునరుద్ధరించారు. ఈ ఘటనకు సంబంధించి బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.106/2026, సెక్షన్ 194(2) దీఁూ కింద కేసు నమోదు చేయబడింది. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే వాస్తవాల ఆధారంగా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. అయితే, ఈ భూ వివాదానికి సంబంధించిన సంఘటనను వక్రీకరిస్తూ, ఒక మహిళ రవిక (జాకెట్) చించి ఆమెను అవమానించినట్లు కొన్ని ప్రసార మాధ్యమాలు, ముఖ్యంగా ఒక టెలివిజన్ ఛానల్, అలాగే సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ప్రసారం చేయడం జరిగింది. పోలీసుల విచారణ మేరకు పై ఘటన లోని మహిళ దుస్తులు చింపడం గానీ, ఎలాంటి అవమానకరమైన చర్య గానీ జరగలేదు. ఈ ప్రచారము నిరాధారం మరియు వాస్తవాలకు విరుద్ధమైనది. భూ సంబంధిత వివాదాన్ని వక్రీకరించి, మహిళ గౌరవానికి భంగం కలిగించినట్లు తప్పుడు ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అనవసర అపోహలు, విద్వేషాలు నెలకొనే అవకాశం ఉంది. ఇటువంటి అసత్య, కల్పిత, రెచ్చగొట్టే కథనాలను ప్రసారం చేయడం లేదా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం చట్టరీత్యా శిక్షార్హమైన చర్య అని మైదుకూరు డిఎస్పి జి.రాజేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. ప్రజలు, మీడియా ప్రతినిధులు ఎలాంటి సమాచారాన్నైనా సంబంధిత అధికారుల ద్వారా ధృవీకరించుకున్న తర్వాత ప్రచారం చేయాలని, నిరాధార వార్తలను విశ్వసించకుండా, వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మండల పరిషత్ పాఠశాలకు విద్యా సామాగ్రి మరియు సౌండ్ బాక్స్ లను బహుకరించిన వారిని శాలువ తో గౌరవించి న ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి





**కలసపాడు,జూలై20.అక్షరటైమ్స్:-** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పుల్లారెడ్డి పల్లె పాఠశాలకు ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా విద్యా సామాగ్రిని, సౌండ్ బాక్స్ అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. రమాదేవి ధన్యవాదాలు తెలిపారు. కల్లూరి జయరాములు దంపతులు 14 వేల రూపాయల విలువైన సౌండ్ సిస్టం ను, బాపనపల్లి వెంకటేశ్వర్లు 10 వేల రూపాయల విలువైన బీరువా, కుమ్మరి సుమన్ కుమార్ దంపతులు 6200 విలువైన పలకలు, ప్యాడ్స్, దగ్గుబాటి కొండయ్య దంపతులు 5000 రూపాయల విలువైన డ్రమ్స్, కీర్తిశేషులు కె పాండు ధర్మపత్ని లక్ష్మీదేవి 10 వేల విలువైన టేబుల్, కుర్చీలు, కేఎం గీతారూత్ మేడం 5 వేల విలువైన 2 రాక్ లు, ఎస్ వి సత్యనారాయణ 4200 విలువైన సిమెంట్ బెంచ్, జి రామ్ కుమార్ 2000 విలువైన భోజనం ప్లేట్లు,బి మహాలక్ష్మి, ఎస్ సుభాషిని, ఎస్ వెంకటయ్య 3 వేల రూపాయల విలువైన ఆట వస్తువులు, చిత్తా శౌరిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ 8 వేల విలువైన నోటు పుస్తకాలు, పసుపులేటి వెంకటమ్మ సేవా సంస్థ 4000 రూపాయల విలువైన నోటు పుస్తకాలు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ విధంగా పాఠశాల అభివృద్ధికి మరియు విద్యార్థుల సౌకర్యం కోసం వివిధ రకాల వస్తువులను అందజేసిన దాతలకు ప్రధానోపాధ్యాయురాలు వి రమాదేవి, ఉపాధ్యాయులు వై నాగిరెడ్డి, ఎస్ వి సత్యనారాయణ, కె.వి భాస్కర్ రెడ్డి, బి రాజేశ్వరి ధన్యవాదములు తెలియజేసినారు. ఈరోజు దాతలను పాఠశాల ఆవరణలో శాలువాతో సన్మానించి, దాతలకు అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధిలో తమ సహకారం అందిస్తామని, తెలియజేశారు.

## ఎరువుల కొరతతో రైతుల అవస్థలు

### తక్షణ సరఫరా చేయాలని సబ్ కలెక్టర్ కు రైతు సంఘం వినతి



**ఆదోని,జూలై20.అక్షర టైమ్స్:-** ఆదోని మండలంలో కొన్ని గ్రామాల్లో వర్షం కురవడంతో ఎరువుల కోసం రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే రైతులకు ఎరువులు సక్రమంగా సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఇన్చార్జి సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడమైనది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే లింగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప మాట్లాడుతూ, ప్రభుత్వం కేవలం ఎకరాకు ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారని దీనివలన రైతులకు చాలా ఇబ్బంది ఏర్పడుతుందన్నారు అలాగే ఫర్టిలైజర్ షాప్స్ లో రెండు బస్తాలు ఇస్తున్న వేరే ఇతర లింకులు అంటగట్టడం వలన రైతులపై భారం పడుతుందని, దీనివలన యూరియా కొనలేకపోతున్నారన్నారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ సక్రమంగా లేకపోవడంతో అక్కడ కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు . కౌలు రైతులు ఎరువులు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌలు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఎరువులు సక్రమంగా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు భాష, మునిస్వామి, మండల నాయకులు దస్తగిరి భాషా, హనుమంత రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'జగన్ 2.0 సూపర్ యాప్' ఘన ఆవిష్కరణ చేసిన డీసీ.గోవింద రెడ్డి







**పోరుమామిళ్ల,జూలై20.అక్షర టైమ్స్:-** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సాంకేతికంగా మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్తను పార్టీ నాయకత్వంతో నేరుగా అనుసంధానించే లక్ష్యంతో పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల్లో దాదాపు రెండు లక్షలకు పైగా కార్యకర్తలతో 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ప్రారంభించాలని ఇచ్చిన పిలుపు మేరకు, బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్లలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ , నియోజకవర్గ యువ నాయకుడు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి లు పాల్గొని యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ, "జగన్ 2.0 సూపర్ యాప్ మన నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి దూరదృష్టికి ప్రతిరూపం. పార్టీ కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక. ప్రతి కార్యకర్త పార్టీ నాయకత్వంతో నేరుగా అనుసంధానమై, పార్టీ కార్యక్రమాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ యాప్ అత్యంత ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి కార్యకర్త తప్పనిసరిగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, మరింత మందికి చేరవేసి డిజిటల్ ఉద్యమంలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టడంతో పాటు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజలకు చేసిన సేవలను ప్రతి ఇంటికి చేరవేయడంలో 'జగన్ 2.0 సూపర్ యాప్' కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ ఈ యాప్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమం, భద్రత, సమాచార వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతోనే పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ యాప్‌ను రూపొందించారని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి రాజకీయ పోరాటంలో ఈ డిజిటల్ వేదిక పార్టీకి మరింత శక్తిని అందిస్తుందని, ముఖ్యంగా యువత, సోషల్ మీడియా వారియర్స్ ఈ యాప్‌ను విస్తృతంగా వినియోగించి పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ మండల కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన ఈ కార్యక్రమం, సాంకేతికతను ఆయుధంగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యే దిశగా ఒక కీలక అడుగుగా నిలిచింది.

## వైఎస్సార్సిపీ నేత, తవ్వా నాగేశ్వర రెడ్డిని పరామర్శించి తవ్వా నాగేశ్వరరెడ్డి త్వరిత గతిన కోలుకోవాలని రెడ్యం ఆకాంక్ష



**ఖాజీపేట,జూలై20.అక్షర టైమ్స్:-** ఖాజీపేట మండలం బి. కొత్తపల్లి పంచాయితీ, బి. తిప్పాయపల్లె కు చెందిన, తవ్వా నాగేశ్వరరె డ్డి కిడ్నీలో రాళ్ళు ఉండడంతో తిరుపతి లోని రష్ హాస్పటల్ లో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అనంతరం స్వగ్రామం బి. తిప్పాయ పల్లెలోని వారి స్వగృహానికి రావడం జరిగింది.వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి సోమవారం సాయంత్రం తవ్వా నాగేశ్వరరెడ్డి ని బి. తిప్పాయ పల్లె లోని వారి స్వగృహం లో పరామర్శించారు. జరిగిన విషయాలను అడిగి తెలుసు కున్నారు.నాగేశ్వర రెడ్డి త్వరితగతిన కోలుకోవాలని రెడ్యం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైదుకూరు నియోజవర్గ రైతు విభాగం అద్యక్షుడు గంగిరెడ్డి నాగిరెడ్డి, వైఎస్ఆర్సిపి నేతలు తవ్వా ఓబుల్ రెడ్డి,గాజులపల్లె రామ సుబ్బారెడ్డి, గంగిరెడ్డి రామ గోపాల్ రెడ్డి,టి.వై .సుబ్బారెడ్డి, రెడ్డిపుల్లారెడ్డి, గంగిరెడ్డి తిప్పారెడ్డి, పత్తి సుబ్బారెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పుట్టా పోలమ్మ పెద్దకర్మ లో పాల్గొన్న సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్,జులై20.అక్షర టైమ్స్:-** మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి దివంగత పుట్టా పోలమ్మ పెద్దకర్మ లో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తో కలిసి బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ పోలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను,పుట్టా మహేష్ ఏలూరు ఎంపీ ని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దివంగత పోలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బద్వేలు నియోజకవర్గం టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ పోలమ్మ కు నివాళులర్పించారు.

## గన్ని వీరాంజనేయులును సన్మానించిన టిడిపి ఇంచార్జ్ సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్,జులై20.అక్షర టైమ్స్:-** ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ను బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ పట్టణం లోని తమ నివాసం లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిజిటల్ డోర్ నంబరింగ్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించిన కమీషనర్ యం.కృష్ణ




**బద్వేల్,జూలై20.అక్షర టైమ్స్:-** బద్వేల్ పురపాలక కార్యాలయంలో పురపాలక కమీషనర్ శ్రీ యం.కృష్ణ ఆధ్వర్యంలో డిజిటల్ డోర్ నంబరింగ్ కార్యక్రమం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, పురపాలక సంఘం పరిధిలోని ప్రతి ఇంటికి, వాణిజ్య సముదాయానికి డిజిటల్ డోర్ నంబరింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిజిటల్ డోర్ నంబరింగ్ ద్వారా పౌర సేవల అందజేత, ఆస్తుల గుర్తింపు, పన్నుల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు మరియు పట్టణ ప్రణాళిక మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. వార్డ్ అడ్మిన్లు, అమెనిటీస్ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జియో-ట్యాగింగ్‌తో డిజిటల్ డోర్ నంబరింగ్ పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజూ పనుల పురోగతిని సమీక్షించి, పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఈ సుమన్ రెడ్డి ,ఆర్ఓ. గంగిరెడ్డి,వార్డ్ అడ్మిన్లు, అమెనిటీస్ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన మెగా జాబ్ మేళా



**బద్వేల్,జులై20.అక్షర టైమ్స్:-** రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాల లో నిర్వహించన మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసిందని కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొని, అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారని ఆయన తెలియజేశారు. విద్యార్థులు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని ఉద్యోగ మేళాలను నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాంక్ లో రిలేషన్‌షిప్ మేనేజర్, మోర్ సూపర్‌మార్కెట్ లో ట్రైనీ మేనేజర్ తదితర ఉద్యోగాల కోసం 150 కి పైగా అభ్యర్థులు ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించగా, అర్హత సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సంబంధిత సంస్థల ప్రతినిధులు ఎంపిక ప్రక్రియను చేపట్టారని సుమారు 70 మంది అభ్యర్థులు పరీక్షను రాయగా 50 మంది. అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో ఐసీఐసీఐ , టి.వి.యస్ - టి అండ్ యస్ అండ్ మోర్ కంపెనీ హెచ్.ఆర్ లు శర్మ, రూపేష్, శివ,ఉదయ్,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాల ఓబులేసు, కళాశాల డీన్ డా.అశోక్, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షాహిన, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ దేవి, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ గంగరాజు,సి. ఈ.రామసుధ తదితరులు పాల్గొన్నారు.


## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

### శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్



**వేంపల్లె,జూలై20.అక్షర టైమ్స్:-** శ్రీ సత్యసాయి బాబా దివ్యాశీస్సులతో శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రేమతరు కార్యక్రమాన్ని స్థానిక పట్టణంలో నిర్వహించినట్లు వేంపల్లె మండల శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం ఆవరణతో పాటు గండి రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయ ఆవరణలో సేవా సమితి సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కుంచా సాయినాథ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ సూచనల మేరకు పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ, సమాజ శ్రేయస్సు లక్ష్యంగా ప్రేమతరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. భావితరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ నరసింహులు, వెటర్నరీ ఏడీ రవీంద్రనాథ్, పులివెందుల ఏపీఎం గురురాజు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పుల్లగూర గోవర్ధన్, శివకిరణ్, శివరంజని, సునీత తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి ని దర్శించుకున్న ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్లు



**బద్వేల్, జులై 20.అక్షర టైమ్స్:-** ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి, డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి లు సోమవారం మధ్యాహ్నం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షర టైమ్

# ప్రతిభతో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలి

## కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి



**వేంపల్లె,జూలై20.అక్షర టైమ్స్:-** విధ్యార్ధులు చదువుల్లో రాణించి తమ ప్రతిభతో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బిఎస్. రమణారెడ్డి వెల్లడించారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డును కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా విధ్యార్థిని షేక్ అఫ్నాన్ రూ.20 వేల చెక్కుతో పాటు మెడల్, ప్రశంస పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో చదువుల్లో రానించి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నతస్థాయికి అధిరోహించి ఆదర్శంగా నిలవాలని కోరారు. తమ పాఠశాల విధ్యార్థిని సాధించిన విజయం పట్ల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రత్యేకహోదా సాధనకు పట్టు పట్టండి

## పార్లమెంట్ సభ్యులకు తులసిరెడ్డి సూచన



**వేంపల్లె,జూలై20.అక్షర టైమ్స్:-** రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదా సాధించేందుకు పార్లమెంట్ సభ్యులు పట్టు పట్టాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. ఎన్. తులసిరెడ్డి సూచించారు. పార్లమెంట్ వర్షకాల సమావేశాల్లో రాష్ట్రానికి చెందిన సభ్యులు ప్రత్యేకహోదా అమలుకు కృషి చేయాలన్నారు. ప్రత్యేకహోదా అమలు ద్వారా ఉపాధిహామీ, సర్వశిక్ష అభియాన్ తదితర కేంద్ర ప్రాయోజిత పథకాలపై కేంద్ర 90 శాతం నిధులు భరిస్తుందన్నారు. అలాగే అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్ తదితర విదేశీ ఆర్థిక సంస్థల సహాయంతో అమలవుతున్న పథకాలకు 90-100 శాతం మేర నిధులు కేంద్రం భరిస్తుందన్నారు. అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మణిపూర్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రత్యేకహోదా అమలవుతోందన్నారు. 2014, ఫిబ్రవరి 20న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఏపి రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని ప్రకటించారన్నారు. మార్చి 1న ప్రత్యేకహోదాపై తీర్మానం చేసి అమలు చేయాలని ప్రణాళిక సంఘాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఆ తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తే పదేళ్ల పాటు ప్రత్యేకహోదా అమలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రత్యేకహోదా అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం దీనిపై ఛాలెంజ్ గా తీసుకుని ప్రత్యేకహోదా అమలు సాధనకు కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పాఠశాల గుర్తింపునకు విధ్యార్థులే కీలకం


## కరస్పాండెంట్ కె. నారాయణ రెడ్డి

## కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్స్ అవార్డులు



**వేంపల్లె,జూలై20.అక్షర టైమ్స్:-** పాఠశాల గుర్తింపునకు విధ్యార్థులే కీలకమని స్థానిక నారాయణ విద్యా సంస్థల కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి వెల్లడించారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను నారాయణ విద్యా సంస్థకు చెందిన విద్యార్థినిలు కె.కీర్తన, డి.కీర్తన లు అందుకున్నారు. ఈ అవార్డులను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. రూ.20 వేల చెక్కుతో పాటు సర్టిఫికేట్, మెడల్స్ లను విధ్యార్థినిలకు పంపిణీ చేశారు. పదోతరగతి -2026 ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విధ్యార్థినిలు కె.కీర్తన(587), డి.కీర్తన(579) అత్యుత్తమ ప్రతిభతో విజయాన్ని సొంతం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను తమ విధ్యార్థినిలు దక్కించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి విధ్యార్థి ఒక లక్ష్య సాధన దిశగా అడుగులు వేసి భవిష్యత్ లో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్జేడి శ్యాముల్, డిఇఓ షంషుద్దీన్, ఆర్ఐఓ పట్నాయక్, జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ భానుప్రకాష్, ఎంఇఓ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# శ్రీ ఈశ్వరదేవి మఠానికి చెందిన వ్యవసాయ భూముల వేలం పాటలు




**బ్రహ్మంగారిమఠం,జూలై20.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారిమఠం కందిమల్లయపల్లి గ్రామం శ్రీ జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠంలో బుధవారం వివిధ గ్రామాల్లోని శ్రీ ఈశ్వరీ దేవి మఠానికి చెందిన వ్యవసాయ భూములను కౌలు పద్ధతిలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు శ్రీ ఈశ్వరి మఠం కార్య నిర్వహణ అధికారి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ వేలం పాట 22 వ తేదీ (బుధవారం) ఉదయం 10.00 గంటలకు శ్రీ ఈశ్వరదేవి మఠం ప్రాంగణంలో నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు. మొత్తం 11 వ్యవసాయ భూములు కౌలుకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనదలచిన రైతులు, ఆసక్తిగల వ్యక్తులు నిర్ణీత సమయానికి అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం నిబంధనలు, భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం తదితర వివరాల కోసం శ్రీ ఈశ్వరదేవి మఠం కార్యాలయాన్ని సంప్రదించాలని మఠం అధికారులు కోరారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న ఆప్కో చైర్మన్ వీరాంజనేయులు

## జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్య నారాయణరెడ్డి.



**బ్రహ్మంగారిమఠం,జూలై20.అక్షర టైమ్స్:-** భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానాన్ని అందించినటువంటి జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారిని సోమవారం ఆంధ్రప్రదేశ్ ఆప్కో చైర్మన్ గన్ని వీరాంజనేయులు, బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి మఠం యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తచెరువు హరిజనవాడ పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి వితరణ






**బద్వేల్,జులై20.అక్షర టైమ్స్:-** బద్వేల్ మండలం కొత్తచెరువు హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో సోమవారం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు యం.మునెయ్య ఆధ్వర్యంలో సెంచరి ప్లై వుడ్ కంపెనీ నందు పనిచేయుచున్న డోనార్ మిట్టా భాస్కర్ కుటుంబ సమేతంగా కొత్తచెరువు హరిజనవాడ పాఠశాలకు విచ్చేసి విద్యార్థుల అవసరాలు తెలుసుకొని సుమారు గా 40 మంది విద్యార్థులకు భోజనం చేయుటకు ప్లేట్లు, స్వీట్స్, బిస్కట్స్, కాంబాక్స్ లు,ఒక్కొక్కరికి నాలుగు నోట్ పుస్తకాలు అలాగే విద్యార్థులకు పెన్సిల్లు, ఎరేసర్లు, షార్ప్నర్లు వితరణ చేయడం జరిగింది. అలాగే విద్యార్థులకు తాగునీటి కోసము ప్రతిరోజు ఒక క్యాన్ మినరల్ వాటర్ ని సప్లై చేస్తానని సభాముఖంగా తెలియజేయడం జరిగింది.అందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునెయ్య మిట్టా భాస్కర్ కుటుంబాన్ని ప్రత్యేకంగా అభినందించి షాలువ, పూల మాల తో సన్మానిచడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ రామయ్య , కొత్తచెరువు గ్రామ మాజీ సర్పంచ్ అనూష శాంతయ్య లు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

## బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్





**బద్వేల్,జులై20.అక్షర టైమ్స్:-** విద్యార్థులందరూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం నెం.2, బద్వేలులో విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, తువ్వాళ్లు, నైట్‌వేర్, వులెన్ బెడ్‌షీట్లు తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో చంద్ర మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అదేవిధంగా గత విద్యా సంవత్సరంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం, నెంబర్ 2 లో చదివి 582 మార్కులు సాధించిన విద్యార్థి షేక్ బషీర్ అహ్మద్ కు గట్టుపల్లి చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గీతాల పెంచలరెడ్డి, గట్టుపల్లి కొండా రెడ్డి గార్లు 5000/- పారితోషికమును అందించారు. వీరు గతవిద్యాసంవత్సరంలో బద్వేలు పరిధిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ లోని పదవతరగతి విద్యార్థులందరికీ పరీక్ష సామాగ్రి అందచేసినట్లు తెలియచేసారు.గతవిద్యాసంవత్సరం బద్వేలు పరిధిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ లో చదివి 500 పైగా మార్కులు పైగా సాధించిన విద్యార్థులందరికీ ప్రైజ్ మని త్వరలోనే అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎ.యస్.డబ్ల్యూ.ఓ హైఫా,స్థానిక వసతిగృహాల వార్డెన్లు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ బాలాజీ మహాలక్ష్మి స్వీట్స్ దుకాణంలో ఆకస్మిక తనిఖీలు

## ఫుడ్ సేఫ్టీనిబంధనలు తప్పనిసరిగా పాటించాలి..

## స్వీట్ దుకాణా దారులకు అధికారులసూచనలు





**ఆదోని,జూలై20.అక్షర టైమ్స్:-** ఆదోని మున్సిపాలిటీ మరియు ఫుడ్ సేఫ్టీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఎంఎం రోడ్ లోని శ్రీ బాలాజీ మహాలక్ష్మి స్వీట్స్ దుకాణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్, ప్రజారోగ్య మేస్త్రీలు పాల్గొని ఆహార భద్రత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా స్వీట్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానం, తయారీ ప్రక్రియ,గడువు తేదీలు, ఫుడ్ సేఫ్టీ నిబంధనల అమలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఆహార వ్యాపారాలు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించాలని, చెల్లుబాటు అయ్యే ఫుడ్ లైసెన్స్ ను కలిగి ఉండాలని, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టంబి2006 నిబంధనాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఆహారభద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోము ని హెచ్చరిస్తూ, జిల్లాలోని ఇతర ఆహార వ్యాపార సంస్థల్లో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయి వెల్లడించారు.

# మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా కళ్యాణిబాయి



**నంద్యాల,జూలై20.అక్షర టైమ్స్:-** నంద్యాల మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా కళ్యాణిబాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మున్సిపల్ కమిషనర్ బి. శేషన్నను మర్యాదపూర్వకంగా కలిసి పలు పరిపాలనా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించే దిశగా సమర్థవంతంగా పనిచేస్తానని కళ్యాణిబాయి పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి, పారిశుధ్యం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేస్తానన్నారు. అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కళ్యాణిబాయికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.

# వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు





**నంద్యాల,జూలై20.అక్షర టైమ్స్:-** పట్టణంలోని భీమవరం రహదారిలో ఉన్న అల్-ఫుర్కాన్ ఈద్గా వద్ద జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్షాల కోసం ఇస్తిస్కా నమాజ్, ప్రత్యేక దువా నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు అబ్దుల్ హాది సయీది అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మౌలానా ముఫ్తి అజ్మతుల్లా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలని, పంటలు బాగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అల్లాను వేడుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు తొలగి రైతులు, ప్రజలకు ఉపశమనం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు అబులైస్, సమద్, మౌలానాలు, మదరసా నిర్వాహకులు, విద్యార్థులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పురోగతిపై సచివాలయం సిబ్బందితో సమీక్ష: వైఎస్ఆర్సిపి కన్వీనర్ డి.సూర్పురాజ్




**ఆదోని,జూలై20.అక్షర టైమ్స్:-** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జూలై 14 తో గడువు ముగిసిన నేపథ్యంలో ఇప్పటి వరకు నమోదైన దరఖాస్తులు పురోగతి, మరణించిన ఓటర్ల తొలగింపు వివరాలు, ఇంకా నమోదు చేసుకొని ఓటర్ల సంఖ్య పై వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కన్వీనర్ డి.సూర్పురాజ్ (మాజీ ఎక్స్ సర్పంచ్ ) సచివాలయం సిబ్బంది తో చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ డి సూర్పు రాజ్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధమైన హక్కు అని అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మరణించిన వారి పేర్లు తొలగింపు, కొత్త ఓటర్ల నమోద, చిరునామా మార్పులు వంటి ప్రక్రియలను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. అలాగే, ఇప్పటికీ ఎస్ ఐ ఆర్ లో నమోదచేసుకొని అర్హులైన ఓటర్లను గుర్తించి వారికి అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ ను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. ప్రజలు కూడా తమ ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శీను, వీరేశ్ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజుల ముందే ఫిర్యాదు అయినా చర్యలు శూన్యం చివరకు పాఠశాల భవనం కూలింది

ప్రమాదం
తప్పిన నిర్లక్ష్యం బట్టబయలు..
పాఠశాల భవనం కూలిన ఘటనపై అగ్రహారం
విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం
కూలిన ప్రభుత్వ పాఠశాల భవనం



**ఆదోని,జూలై20.అక్షర టైమ్స్:-** ఆదోని పట్టణంలోని పార్వతపురం ప్రభుత్వ పాఠశాల భవనం పాక్షికంగా కూలిపోవడం విద్యశాఖ అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పట్టే ఘటనగా స్థానికులు విమర్శిస్తున్నారు. అదృష్టవశాత్తు విద్యార్థులు పాఠశాల విడిచి వెళ్లిన తర్వాతే ఈ ప్రమాదం జరగడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. అదే ఘటన పాఠశాల సమయంలో జరిగి ఉంటే తీవ్ర విషాదం చోటు చేసుకునేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థలో ఉందని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు సురేష్ కుమార్ నెల రోజుల క్రితమే విద్యాశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవిచినట్లు సమాచారం. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో చివరకు భవనం ఆర్చికంగా కూలిపోయిందని ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి. ఈ ఘటనపై బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పార్వతిపురం ప్రభుత్వ పాఠశాల భవనాన్ని వెంటనే పూర్తి స్థాయిలో పరిశీలించి విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని శిథిలావస్థలో ఉన్న అన్ని పాఠశాల భవనాలపై ప్రత్యేకత తనిఖీలు నిర్వహించి, ప్రమాదకర భవనాలను వెంటనే మరమ్మతి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

## కలెక్టర్, ఎమ్మెల్సీ సమక్షంలో నందిగ్రామ సమంత కు 3 గ్రాముల బంగారు కమ్మలను అందజేసిన మంత్రి ఫరూక్




**నంద్యాల,జూలై20.అక్షర టైమ్స్:-** రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంచేందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. 2026 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 585 మార్కులకు పైగా సాధించే ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, కస్తూర్బా పాఠశాలల నంద్యాల బాలికలలో ఒకరికి 3 గ్రాముల బంగారం బహూకరిస్తామని ఈ ఏడాది ఫిబ్రవరిలో మంత్రి గ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీ మేరకు, నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదివి, పదవ తరగతి ఫలితాలలో 589 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నందిగ్రామ సమంత అనే విద్యార్థినికి మంత్రి ఫరూక్ హామీ ఇచ్చిన బంగారాన్ని అందజేశారు.ఈరోజు నంద్యాల చాబోలు రోడ్డులోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి మరియు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి సమక్షంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ విద్యార్థిని సమంత కు 3 గ్రాముల బంగారు కమ్మలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినులు చదువులో రాణించాలనే ఉద్దేశంతోనే ఈ బహుమతిని ప్రకటించామని, సమంత లాంటి విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జనార్ధన్ రెడ్డి, ఉర్దూ డిఐ అస్మద్దీన్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# క్యాబినెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి: ఎస్టీయూ



**ఆదోని,జూలై20.అక్షర టైమ్స్:-** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21న నిర్వహించనున్న క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై సానుకూల నిర్ణయాలు తీసుకొని న్యాయం చేయాలని ఎస్టీయూ ఆదోని పట్టణ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా స్థానిక మునిసిపల్ హై స్కూల్, నందు ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడమైనది. పట్టణ శాఖ అధ్యక్షులు ఎస్. భీమరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ కర్నూలు జిల్లా అదనపు కార్యదర్శి వి. రమేష్ నాయుడు మాట్లాడుతూ, గత ఎనిమిది సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు, 11వ పీఆర్సీ అరియర్స్ తదితర అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదన్నారు. ఈ నెల 21న ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకులతో నిర్వహించే సమావేశంలో 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, 30 శాతం మధ్యంతర భృతి (ఐ ఆర్ ) ప్రకటనతో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయాలు వెలువడని పక్షంలో ఈ నెల 26వ తేదీ తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు... అదేవిధంగా,సీనియర్ ఉపాధ్యాయుల ప్రయోజనాల దృష్ట్యా విద్యా హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్ ) సెక్షన్--23, ఉప సెక్షన్--(1)లో అవసరమైన సవరణలు చేయడానికి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ ఆదోని పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి పి.గంగానాయక్,ఆర్థిక కార్యదర్శి డి.మహబూబ్ సుభాన్,జిల్లా గౌరవ అధ్యక్షులు సి.నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.లోక్య నాయక్,రాష్ట్ర మాజీ పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్,ఎస్టీయూ నాయకులు కె. రవి తదితరులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపుకే కన్నం - 48 గంటల్లోనే భారీ చోరీ కేసు ఛేదించిన రాయచోటి పోలీసులు

**పక్కా స్కెచ్‌తో దొంగతనం**

**కటకటాల్లోకి ఇద్దరు నిందితులు**


**210 గ్రాముల బంగారం, కేటీఎం బైక్ స్వాధీనం**

**లక్కిరెడ్డిపల్లి,జూలై20.అక్షర టైమ్స్:-** ఎస్పీ ఆదేశాల మేరకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రాయచోటి డిఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్ లక్కిరెడ్డిపల్లి అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో జరిగిన భారీ గృహ చోరీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్, ఆదేశాల మేరకు పక్కా వ్యూహంతో, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను అరెస్టు చేశారు. సోమవారం లక్కిరెడ్డిపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్.కృష్ణమోహన్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను పత్రికా ముఖంగా వెల్లడించారు.బాధితులు కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి గురువారం లక్కిరెడ్డిపల్లి మండలం కోణంపేట సంతకు వెళ్లి, అక్కడే రాత్రి బస చేసి మరుసటి రోజు ఇంటికి రావడం వారి దినచర్య. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 8:30 గంటలకు సంతకు వెళ్లిన దంపతులు, 17వ తేదీ ఉదయం 10:00 గంటలకు గాలివీడులోని తమ ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి షాక్‌కు గురయ్యారు. బీరువాలో భద్రపరిచిన కుటుంబ సభ్యులకు కుమారుడు, కోడలు, మనవడు, మరదలు, అల్లుడు, భార్య చెందిన సుమారు 210 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి, వెంటనే గాలివీడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు గాలివీడు పోలీస్ స్టేషన్‌లో కేసు క్రైమ్ నంబర్ 162/2026 నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం.ఆర్.కృష్ణమోహన్ పర్యవేక్షణలో లక్కిరెడ్డిపల్లి సీఐ హెచ్.కృష్ణంరాజు నాయక్ రంగంలోకి దిగారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, 20.07.2026 ఉదయం గాలివీడు మండలం, పేరంపల్లి గ్రామం, రెడ్డివారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన 210 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు, నేరానికి ఉపయోగించిన కేటీఎం 125 డ్యూక్ మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో గాలివీడుకు చెందిన డ్రైవర్ చెప్పలి కాశి 24, తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన ఎలక్ట్రీషియన్ మారిశెట్టి సాయికుమార్ 20 ఉన్నారు. ప్రధాన నిందితుడు ఎ 1 కాశికి, బాధితులకు మధ్య ఉన్న కుటుంబ భూవివాదాలే ఈ చోరీకి ప్రధాన కారణం. పాత కక్షను మనసులో పెట్టుకుని బాధితులను ఆర్థికంగా దెబ్బతీయాలన్న ఉద్దేశంతోనే కాశి



ఈ చోరీకి పథకం పన్నాడు. అవకాశం కోసం వేచి చూసిన నిందితుడు, బాధితులు గురువారం ఇంట్లో ఉండరనే విషయాన్ని గమనించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. మొదట నేరానికి నిరాకరించిన తన స్నేహితుడైన ఎ2 సాయికుమార్‌ను కూడా ప్రలోభపెట్టి ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. కేసు నమోదైన 48 గంటల్లోనే సాంకేతికతను ఉపయోగించి అద్భుతమైన పనితీరుతో నిందితులను పట్టుకున్న లక్కిరెడ్డిపల్లి సీఐ హెచ్.కృష్ణంరాజు నాయక్, గాలివీడు ఎస్సై జె.నరసింహారెడ్డి, మరియు వారి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# తెలుగుజాతి వెలుగు రేఖ.. తుర్లపాటి



'అందరినీ ప్రేమించు! అందరినీ పలకరించు! మరల ఈ దారిన వస్తానో, రానో!' రాము, రాబోము. ఈ మహత్తర మానవ జీవిత సందేశాన్ని పాటించడమే మానవ జీవిత ప్రస్థానానికి సాఫల్యం. చివరగా ఒక మాట. నేను ఎప్పుడూ చేప్పే మాటే. 'జాతి, మత, కుల, వర్ణ, వర్గ, స్త్రీ, పురుష విభేదాలకు అతీతమైన, మానవుడు మానవునిపట్ల మానవుడుగా వ్యవహరించే మానవీయ వ్యవస్థ మన లక్ష్యం కావాలి' అని పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు తన 'నా కలం%-%నా గళం' ఆటో బయోగ్రఫీలో రాసుకున్నారు. మహాత్మాగాంధీ ఆటోగ్రాఫ్ సంపాదించిన తుంటరి తుర్లపాటి... ఐరన్ లేడీ ఇందిరాగాంధీ ఇంటికొచ్చి పరామర్శించేంత గొప్ప వ్యక్తిత్వం... మా జాతిపితకు నోబెల్ ఎందుకివ్వరు అంటూ నిర్వాహకుల్ని నిలదీసిన తెగువ... ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి, ఆంధ్రకేసరి త్యాగాలను రికార్డు చేసిన కలం... మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, రాజాజీలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపిన మహా మేధావి.. బిల్ క్లింటన్‌నూ భారతదేశానికి ఉత్తరం ద్వారా రప్పించిన జనహితుడు. ఉత్తరాలతోనూ ఉద్యమాలను నడిపించిన సత్తా.. నిరసన తెలిపిన చాతుర్యం సొంతం చేసుకున్న తుర్లపాటి కుటుంబరావు తాను నడిచిన దారి నిండా మంచితనం, మానవత్వం మొక్కలు నాటుకుంటూ మహావృక్షాలుగా చేసి వార్తలలో వ్యక్తిగా.. బహుముఖ ప్రజ్ఞాశక్తిగా శాశ్వతత్వం సాధించారు. కలకాలం నిలిచే ఆయన కలం.. తెలుగు భాష ఉన్నంతవరకూ ప్రతిధ్వనించే ఆయన గళం ఒక చరిత్ర. ఏడు దశాబ్దాల పాటు నిర్విరామంగా పాత్రికేయునిగా కొనసాగిన తుర్లపాటి కుటుంబరావు తెలుగుజాతి వెలుగు రేఖ. 14 ఏళ్లకే రచనా వ్యాసంగంలోకి వచ్చి పాత్రికేయుడైన తుర్లపాటి కుటుంబరావు 1933 ఆగస్టు 10న సుందర రామారావు, శేషమాంబ దంపతులకు విజయవాడలో జన్మించారు. విద్యాభ్యాసం గన్నవరం, విజయవాడలలో కొనసాగించారు. నార్ల వేంకటేశ్వరరావు గారికి ఏకలవ్య శిష్యుడు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి 'ఆంధ్ర కేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు వద్ద కార్యదర్శిగా పనిచేశారు. తుర్లపాటి వంటి ఘనాపాఠీని పరిచయం చేయడానికి భారీ కాన్వాస్ అవసరం. తెలుగు నేలపైనే కాదు, దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అరుదైన వ్యక్తి.. ఒక దేశ ప్రధాని కుటుంబంతో నాలుగుతరాలుగా అనుబంధం కొనసాగడం అంటే మాటలా? జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ ఇలా నాలుగు తరాలు మారినా తరగని స్నేహబంధం ఏర్పడింది. ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు, ఇప్పటి మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ దగ్గర నుంచి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వరకు, ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు నుంచి నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వరకూ 20 మంది ముఖ్యమంత్రులకు తలలో నాలుకలా వ్యవహరించినా, ఏ రాజకీయ పార్టీకి చెందని అజాతశత్రువు.

నాటి ప్రధానమంత్రులు.. కేంద్రంలో కీలక నేతలైన ఇందిరాగాంధీ, మొరార్జీ దేశాయ్, రాజీవ్‌గాంధీ, జగ్జీవన్‌రామ్ లాంటి ఉద్దండుల ఇంగ్లీష్ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించే ఒకే ఒక తెలుగు గళం తుర్లపాటి. ఒకసారి వేదిక ఎక్కి మాట్లాడితే మురిసిపోతాం.. స్వాతంత్ర్యం రాక ముందు నుంచీ, స్వర్ణోత్సవ కాలం ముందు వరకూ 20 వేల ఉపన్యాసాలు ఇచ్చిన 'ఉపన్యాస కేసరి' గురించి కొత్తగా మనం ఏం ఉపన్యసించగలం? 'వార్తల్లోని వ్యక్తి' అనే శీర్షికను తొలుత ఆంధ్రజ్యోతిలో తర్వాత వార్త దినపత్రికలో మొత్తం దాదాపు 50 సంవత్సరాలు కొనసాగించి రికార్డ్ నెలకొల్పారు. ఈ శీర్షిక ద్వారా వికిపీడియాను మించిన కచ్చితమైన సమాచారాన్ని అందించిన 'వార్తల్లోని వ్యక్తి' కుటుంబరావు. దాదాపు 6,000 మంది జీవితచరిత్రలు రాసి, చరిత్ర సృష్టించిన ఆటోబయోగ్రఫీస్ స్పెషలిస్ట్ మన తుర్లపాటి. పద్మశ్రీ అందుకున్న తొలి తెలుగు పాత్రికేయ ఎవరెస్ట్ శిఖరం కుటుంబరావు.. చివరికి సొంతిల్లు కూడా లేదు. మంచితనం, మానవత్వం, నిజాయితీ, నిబద్ధత.. వీటినే ఆయన తరతరాలకు తరగని ఆస్తిగా మురిసిపోయేవారు. పాత్రికేయుడిగా, అనువాదకుడిగా, జీవిత చరిత్రలు రచించిన రచయితగా, ఉపన్యాసకుడిగా, రాజకీయ నేతలకు కార్యదర్శిగా ఏ బాధ్యతనైనా తుర్లపాటి కుటుంబరావు మాత్రమే నిర్వర్తించగలరు అన్న బలమైన ముద్ర వేసుకోగలిగారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ కుటుంబంలో తుర్లపాటి ఇంటిపెద్ద వంటి వారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్‌ను స్థాపించి నటీనటులకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించేవారు. ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం 'నంది' అవార్డులు ప్రవేశపెట్టటానికి కుటుంబరావు ఇచ్చిన అవార్డులే ప్రేరణ. అక్కినేని నాగేశ్వరరావుకి 1957లో 'నటసామ్రాట్' బిరుదుని, హీరో కృష్ణకి 'సూపర్ స్టార్' బిరుదుని ఇచ్చింది కుటుంబరావే. నేషనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా, నంది అవార్డ్స్ కమిటీ సభ్యుడిగా, 'జ్యోతిచిత్ర' ఎడిటర్‌గా, నేషనల్ ఫిల్మ్ అడ్వైజర్‌గా వివిధ హోదాలలో పనిచేశారు. తుర్లపాటి బహుముఖ ప్రతిభకు 'ఉపన్యాస కేసరి', 'దశ సహస్ర సభా కేసరి' అనే బిరుదులుబీ ఆంధ్రా యూనివర్సిటీ వారి 'కళా ప్రపూర్ణ', తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 'నేషనల్ సిటిజన్స్' అవార్డ్, ముట్నూరి కృష్ణారావు ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్, అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా 'ఇంటర్నేషనల్ మాన్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు వరించాయి. 2002లో అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' అందుకున్న ఏకైక తెలుగు జర్నలిస్ట్ తుర్లపాటి కుటుంబరావు కలం నుంచి జాలువారిన రచనలు కలకాలం నిలిచే ఉంటాయి. ఆయన గళం తెలుగు భాష ఉన్నంతవరకూ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆయనకు జననమే కానీ మరణం లేదు. తుర్లపాటి జీవించు ప్రజల నాలుకల యందు.. తుర్లపాటి కుటుంబరావు జీవితచరిత్ర భావితరాలకు అందేలా పునర్ముద్రించాలని, ఆయన పేరుతో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు ఇవ్వాలని ఒక జర్నలిస్టుగా ఆయన జయంతి సందర్భంగా ప్రభుత్వాన్ని వినమ్రంగా కోరుతున్నాను.

# కోపైలట్.. చూసుకుంటుంది!




ఫోన్‌లో యాప్‌లే కాదు.. వెబ్ విహారానికి వాడే బ్రౌజర్లు కూడా ఏఐ సపోర్ట్‌తో ముందుకొస్తున్నాయి. బ్రౌజింగ్‌లోనూ వినూత్నమైన ఫీచర్స్ పరిచయం అవుతున్నాయి. మైక్రోసాఫ్ట్ 'కోపైలట్' ఇలాంటి ఫీచరే! మనం బ్రౌజర్ వాడుతున్నప్పుడు చాలా ట్యాబ్‌లు ఓపెన్ చేస్తుంటాం. వాటిని పదే పదే యాక్సెస్ చేయడం విసుగు తెప్పిస్తుంది. 'కోపైలట్' మోడ్ ఎంపిక చేసుకుంటే బ్రౌజింగ్ ఎక్స్‌పీరియన్స్ పూర్తిగా మారిపోతుంది. కోపైలట్ చాట్‌బాట్‌ను ఉపయోగించి ఓపెన్ చేసిన అన్ని ట్యాబ్స్‌ను సులభంగా మేనేజ్ చేయొచ్చు. అన్ని ట్యాబ్‌లను ఎక్స్‌ప్లోర్ చేస్తూ.. రెస్టారెంట్ బుకింగ్‌లు, ప్రొడక్ట్ కంపారిజన్‌లు, కంటెంట్‌ను సమ్మరైజ్ చేయడం.. లాంటి పనులు క్షణంలో చక్కబెట్టొచ్చు. వేర్వేరు ట్యాబ్‌లలో ఓపెన్ చేసిన హోటల్ లిస్టింగ్‌లను పోల్చవచ్చు. ఈ-షాపింగ్‌లో ఉత్తమ ప్రొడక్ట్‌ను ఎంచుకోవడానికి సాయం తీసుకోవచ్చు. వీటన్నిటికీ మీరు ట్యాబ్‌లను మార్చాల్సిన అవసరం లేదు. ఒకే క్లిక్‌తో అన్ని పనులూ జరిగిపోతాయి. అంతేకాదు.. వాయిస్ కమాండ్స్‌తో బ్రౌజర్‌ని ఆపరేట్ చేయొచ్చు. దీంతో బ్రౌజర్‌తో ఇంటరాక్ట్ అవ్వడం చాలా సులభం అవుతుంది. ఈ ఏఐ అసిస్టెంట్ యూజర్లకు సందర్భోచితంగా సాయం చేస్తుందన్నమాట. కోపైలట్ గురించి ఎడ్జ్ ప్రొడక్ట్ వైస్ ప్రెసిడెంట్ సీన్ లిండర్‌సే మాట్లాడుతూ.. 'భవిష్యత్తులో ఈ మోడ్ యూజర్ల వర్క్‌ఫ్లోకు అనుగుణంగా టాపిక్-బేస్డ్ జర్నీని రూపొందించడానికి సహాయపడుతుంది. యూజర్ పర్మిషన్‌తో, బ్రౌజర్ హిస్టరీ, క్రెడెన్షియల్స్‌ను కూడా యాక్సెస్ చేసే సామర్థ్యాన్ని కోపైలట్ మోడ్‌కు ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ ప్లాన్ చేస్తున్నద'ని చెప్పుకొచ్చారు. సింపుల్‌గా చెప్పాలంటే.. కోపైలట్ మోడ్ రాకతో బ్రౌజింగ్ మరింత సులభంగా, వ్యక్తిగతంగా మారుతుందన్నమాట! అయితే, ఏఐ అందించే సమాచారంలో కొన్నిసార్లు తప్పులు ఉండవచ్చు. కాబట్టి, ఏదైనా చర్య తీసుకునే ముందు, వాస్తవాలను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవడం ముఖ్యమని మైక్రోసాఫ్ట్

## తప్పిపోయిన చిన్నారి సురక్షితంగా గుర్తింపు



**నంద్యాల,జూలై20.అక్షర టైమ్స్:-** నంద్యాల పట్టణంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన నాలుగేళ్ల చిన్నారి ప్రణవి కనిపించడం లేదని ఆమె తల్లి బి. కళ్యాణి సోమవారం రాత్రి డయల్-112కు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన నంద్యాల తాలూకా పోలీసులు వైఎస్సార్ నగర్ పరిసరాల్లో విస్తృత గాలింపు చేపట్టారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. నంద్యాల సబ్‌డివిజన్ ఏఎస్పీ సుస్మిత, ఆధ్వర్యంలో పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో పాటు డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక బృందాలతో కాలువలు, పొలాలు తదితర ప్రాంతాల్లో గాలింపు నిర్వహించారు. పోలీసుల నిరంతర శ్రమ ఫలితంగా మంగళవారం తెల్లవారుజామున వైఎస్సార్ నగర్ సమీపంలోని పొలాల్లో చిన్నారి ప్రణవిని సురక్షితంగా గుర్తించి ఆమె తల్లి బి. కళ్యాణికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-112కు సమాచారం అందిస్తే పోలీసులు త్వరితగతిన స్పందించగలరని తెలిపారు. గాలింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

# వంతాటిపల్లి పేకాట స్థావారాలపై పోలీసుల దాడులు

**నలుగురు జూదరులను అరెస్టు రూ.14,066 నగదు స్వాధీనం**



**సిద్ధవటం,జూలై20.అక్షర టైమ్స్:-** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు సిద్దవటం పోలీస్ స్టేషన్ పరిధిలోని వంతాటిపల్లి పేకాట స్థావారాలపై పోలీసుల దాడులు నలుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14,066 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన సిద్దవటం పోలీసులు. పత్రికలు ద్వారా వివరాలు వెల్లడించిన సిద్దవటం ఎస్సై హారిక.

## అసలు మునగాకులను ఎలా తినాలి..? వీటిలో ఏమేం లాభాలు కలుగుతాయి..?



కూరగాయలు, ఆకుకూరలు అంటే మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నవే కనిపిస్తాయి. కానీ మన చుట్టూ పరిసరాల్లో ఉండే వాటి గురించి అంతగా ఆలోచించం. నిజానికి అలాంటి కూరగాయలు లేదా ఆకుకూరల్లోనే అనేక ఔషధ గుణాలు ఉంటాయి. అలాంటి వాటిల్లో మునగాకులు కూడా ఒకటి అని చెప్పవచ్చు. వీటిని బయట మార్కెట్‌లో విక్రయించరు. అలా అని చెప్పి వీటిని తినకూడదు అని కాదు, తినవచ్చు, కానీ వాటిని తినాలని చెప్పి చాలా మందికి అవగాహన లేదు, ఆయుర్వేదం దీని గురించి చాలా స్పష్టంగా వివరించింది. మునగాకులు ఏకంగా 300కు పైగా రోగాలను నయం చేస్తాయని ఆయుర్వేద వైద్యులు చెబుతుంటారు. అయితే మునగాకులు ఆరోగ్యకరమైనవి అని తెలుసు కానీ వాటిని ఎలా తినాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు ఆయుర్వేద వైద్యులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

### మునగాకుల పొడి..

మునగాకులను ఎండబెట్టి పొడి చేసి ఆ పొడిని ఉపయోగించవచ్చు. దీన్ని మీరు రోజూ తాగే జ్యూస్‌లలో, స్మూతీల వంటి వాటిలో కలిపి తీసుకోవచ్చు. రోజుకు 1 నుంచి 2 టీస్పూన్ల మునగాకు పొడిని వాడితే సరిపోతుంది. ఒక గ్లాస్ యాపిల్ లేదా నారింజ పండ్ల జ్యూస్‌లోనూ ఈ పొడిని కలిపి తీసుకోవచ్చు. సలాడ్స్, రోస్ట్ చేయబడిన కూరగాయలు, పాస్తా, కోడిగుడ్లపై ఈ పొడిని చల్లి తినవచ్చు. సూప్‌లు, చారు, రసం వంటి వాటిల్లోనూ కలిపి తీసుకోవచ్చు. మునగాకుల పొడితో టీ తయారు చేసి తాగవచ్చు. వేడి నీటిలో మునగాకుల పొడిని కలిపి 5 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత నీటిని వడకట్టి అందులో రుచికోసం తేనె, నిమ్మరసం కలిపి తాగవచ్చు. మీరు తినే గోధుమ బ్రెడ్ వంటి వాటిపై కూడా ఈ పొడిని చల్లి తినవచ్చు. పెరుగు, ఓట్‌మీల్, చియా విత్తనాలతోనూ కలిపి తినవచ్చు.

### మునగాకులు..

మీరు తినే సలాడ్స్‌లో మునగాకులను నేరుగా కలిపి తినవచ్చు. రోజూ చేసుకునే కూరల్లోనూ మునగాకులను కొద్దిగా వేయవచ్చు. సూప్‌లలోనూ మునగాకులను వేసి తీసుకోవచ్చు. ఈ విధంగా మునగాకులను లేదా వాటి పొడిని తీసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. అయితే పొడి రూపంలో తీసుకుంటే 1 లేదా 2 టీస్పూన్లకు మించకూడదు. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ సంభవించే అవకాశాలు ఉంటాయి. ఇక మునగాకుల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి. మునగాకుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ ఆకుల్లో ఉండే విటమిన్ ఎ కంటి చూపును పెంచడంతోపాటు రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారేలా చేస్తుంది. పాలు, పాలకూర వంటి వాటి కన్నా మునగాకుల్లోనే కొన్ని వందల రెట్ల క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది.

### లాభాలు..

మునగాకుల్లో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. మునగాకుల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీ అదుపులో ఉండేలా చేస్తుంది. ఈ ఆకుల్లోని మెగ్నిషియం కండరాలను ప్రశాంత పరుస్తుంది. దీంతో కండరాల నొప్పులు తగ్గిపోతాయి. రాత్రి పూట పిక్కలు పట్టుకుపోకుండా ఉంటాయి. మునగాకుల్లో క్వర్సెటిన్, క్లోరోజెనిక్ యాసిడ్, బీటా కెరోటిన్ వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులను తగ్గిస్తాయి. దీంతో రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పోటు రాకుండా నివారిస్తాయి. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు రోజూ మునగాకులను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ ఆకులను తినడం వల్ల లేదా పొడిని వాడడం వల్ల షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా మునగాకులను తీసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.